
ప్రజాశక్తి
గురువారం 26 సెప్టెంబర్ 2024
5
పార్వతీపురం మన్యం



జిల్లా అభ్యర్థులనే నియమించాలి

పార్వతీపురం రూరల్ : మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ఆసుపత్రి కేంద్రంగా నిర్వహించే వన్‌స్టాప్ సెంటర్లలో జిల్లా అభ్యర్థులనే నియమించాలని నిరుద్యోగ మహిళలు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్, ఐసిడిఎస్ పిడి కార్యాలయాల్లో వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా జిల్లా ఏర్పడిన తర్వాత మంజూరైన ఈ ప్రాజెక్టులో స్థానిక అభ్యర్థులకు అవకాశం కల్పిస్తే జిల్లాకు న్యాయం చేసినట్లుగా ఉంటుందన్నారు. జిల్లా అధికారులు స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వన్‌స్టాప్ సెంటర్లలో నియామకాలను జిల్లాలోని అభ్యర్థులకే పరిమితం చేయాలని విజ్ఞప్తిచేశారు. ఈ విషయం ఐసిడిఎస్ పీడీ నూర్జహాన్ దృష్టికి తీసుకువెళ్లగా, ఈ పథకం అమలు అవుతున్న జిల్లాలలో స్థానికులకే అక్కడి జిల్లా అధికారులు అవకాశం ఇచ్చారని తెలిపారు. ఇక్కడ కూడా జిల్లా అధికారులు స్పందించి స్థానికులకే అవకాశం ఇస్తే తమకు ఎలాంటి అభ్యంతరమూ లేదన్నారు.

నామినేటెడ్ పోస్టుల భర్తీలో..
సీనియారిటీపై చిన్నచూపు

- రగిలిపోతున్న మాజీ ఎమ్మెల్యేలు
- పదవుల పందేరంలో లోకేష్ ముద్రపై ప్రచారం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటిపోయింది. ఎప్పుడెప్పుడా? అని ఎదురుచూస్తున్న నామినేటెడ్ పదవుల పందేరం మొదలైంది. టిడిపి ఆవిర్భావం తర్వాత ఎన్నడూ లేని విధంగా ఈసారి నామినేటెడ్ పదవుల భర్తీలో సీనియారిటీని చిన్నచూపు చూడటం స్పష్టంగా కనిపించింది. పదవులివ్వకపోయినా బాధపడకుండా మిన్నకుండి పోవాల్సిన సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలను పార్టీ అవమానించిందనే వాదనలు వినిపిస్తున్నాయి.



ఆర్‌పి భంజ్‌దేవ్   గద్దె బాబూరావు

ప్రజాశక్తి-పార్వతీపురం

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు ఆర్‌పి భంజ్ దేవ్, గద్దె బాబూరావులకు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ పదవులను కేటాయించడం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశమవుతోంది. మూడు, నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన సీనియర్ నాయకులుగా భంజ్‌దేవ్, బాబూరావుకు గుర్తింపు ఉంది. పార్టీ ఆవిర్భావం నుంచి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. మాజీ ఎమ్మెల్యే బాబూరావు కొద్ది కాలం అన్న తెలుగుదేశం పార్టీలో పని చేశారు. తర్వాత మళ్లీ టిడిపిలోనే చేరారు.

మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ 1989 నుంచి టిడిపి రాజకీయాల్లో ఉంటున్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. గత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి సంధ్యారాణి విజయం కోసం ఆయన పని చేశారు. పార్టీని గెలిపిస్తే ఎమ్మెల్సీ పదవి ఇస్తానని గతంలో అధినేత చంద్రబాబు నాయుడు భంజ్‌దేవ్‌కి హామీ కూడా ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో వారు కోరకుండానే కార్పొరేషన్ డైరెక్టర్ పదవులిచ్చి ప్రభుత్వం వారి సీనియారిటీని తీవ్రంగా అవమానించిందనే చర్చ పార్టీ నాయకుల్లో సాగుతోంది.

పదవుల పందేరంలో పార్టీ నాయకత్వం వ్యవహరించిన తీరుపై మాజీ ఎమ్మెల్యే భంజ్ దేవ్ అనుచరులు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డైరెక్టర్ పదవి తీసుకోవద్దని ఒత్తిడి పెంచుతున్నట్లు తెలిసింది. మరోవైపు భంజ్‌దేవ్ కూడా గుంభనంగా ఉన్నారు. పార్టీ నిర్ణయాన్ని ఎదురించలేక, ఔననలేక అంతర్మథనం చెందుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. త్వరలో సిఎం చంద్రబాబు నాయుడును కలిసి తన మనసులోని మాట చెప్పేయాలని, డైరెక్టర్ పదవిని తిరస్కరించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

పదవుల కేటాయింపుల్లో లోకేష్ ముద్ర

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏర్పడిన మంత్రివర్గంలోనూ టిడిపి జాతీయ కార్యదర్శి లోకేష్ ముద్ర స్పష్టంగా కనిపించింది. ఉమ్మడి జిల్లాకి సీనియర్ ఎమ్మెల్యేలను పక్కనపెట్టి జూనియర్ ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటు కల్పించడం వెనుక లోకేష్ హస్తం ఉందనే ప్రచారం అప్పట్లో సాగింది. తాజాగా నామినేటెడ్ పదవుల భర్తీలోనూ లోకేష్ ముద్ర కనిపించిందనే చర్చ నడుస్తోంది. సీనియర్ మాజీ ఎమ్మెల్యేలకు కార్పొరేషన్ డైరెక్టర్ పదవులివ్వడం వెనుక ఆయన ప్రమేయం ఉందేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాకు విద్యుత్తు సర్కిల్ కార్యాలయం

ఎస్ఇగా చలపతిరావు నియామకం



ఎస్ఇ చలపతిరావు

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా కేంద్రంలో ఇపిడిసిఎల్ సర్కిల్ కార్యాలయం ఏర్పాటు కానుంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన 13 జిల్లాలకు సర్కిల్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ఏర్పడి రెండున్నరేళ్లు గడిచినా ఇంతవరకు విజయనగరం జిల్లా సర్కిల్ కార్యాలయం నుంచే కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఇప్పుడు సర్కిల్ కార్యాలయం మంజూరు కావడంతో ఎస్ఇగా కె.చలపతిరావును నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్న చలపతిరావును సర్కిల్ ఎస్ఇగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు సంబంధించిన సిబ్బంది నియామక ప్రక్రియ మొదలైంది. కొద్దిరోజుల్లో సర్కిల్ కార్యాలయం ప్రారంభం కానుంది.

అకౌంట్స్ అధికారిగా శ్రీనివాసరావును, పిఒగా గంటి శ్రీనివాస్‌ను నియమిస్తూ సిఎండి ఆదేశాలు జారీచేశారు. ఇంతవరకు విజయనగరంలోని ఎస్‌పిఎం ప్రొటెక్షన్ సీటీ మీటర్ల విభాగాలను కుదించి... అక్కడి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల పోస్టులను మన్యం జిల్లాకు మళ్లించారు. ఇంకా సీనియర్ అకౌంట్స్ అధికారిని నియమించాల్సి ఉంది. సిహెచ్.మాధవనాయుడును డిప్యూటీ ఇఇగా టిఆర్ఇ విభాగానికి, ఎ.రామకృష్ణను డిప్యూటీ ఇఇగా ఎల్‌టి మీటర్లు, ఎస్‌పిఎం విభాగాలకు.. డిప్యూటీ ఇఇ కె.బాలాజీని కమర్షియల్, టెక్నికల్ విభాగాలకు, డిప్యూటీ ఇఇ ఆర్.తిరుపతిరావును హెచ్‌టి సీటీ మీటర్ల విభాగానికి, ఎం.లక్ష్మీనారాయణను కనస్ట్రక్షన్ విభాగానికి నియమించారు. వీరందరూ తక్షణమే నూతనంగా కేటాయించిన విభాగాలలో చేరాలని సిఎండి ఆదేశాలలో పేర్కొన్నారు.

నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి

ఎస్‌పి మాధవరెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

నేర నియంత్రణపై పోలీసు అధికారులు దృష్టి సారించాలని ఎస్‌పి ఎస్.వి మాధవరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం పార్వతీపురం మల్టీ ఫంక్షన్ హాల్లో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, తదితర కేసులను సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల ఛేదింపునకు, పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు, మెళకువలను అధికారులకు ఎస్‌పి దిశానిర్దేశం చేశారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ చూపినఅధికారులకి,సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. సమావేశంలో ఎఎస్‌పిలు దిలీప్ కిరణ్, అంకిత సూరన్, డిఎస్‌పి ఎం.రాంబాబు, కేశవరావు (ఎపిపి), జి.వెంకటరమణ(పి.పి), ఎస్‌బి సిఐ సిహెచ్.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రధానమంత్రి జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ ప్రణాళికలు సమర్పించాలని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ఆర్.జయ ఆదేశించారు. ప్రధాన మంత్రి జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్‌పై వివిధ రాష్ట్రాల జిల్లా కలెక్టర్లు, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ తదితరులతో వీడియో కాన్ఫరెన్స్‌లో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కార్యదర్శి కింద ప్రణాళికలను గురువారం నాటికి సమర్పించాలన్నారు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలపై పూర్తి వివరాలను ఉండాలని ఆమె చెప్పారు. గిరిజనుల వైద్య సేవలకు ఉత్తమ ఆసుపత్రిని ఎంపిక చేసి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలు, పరికరాలపై తక్షణం ప్రతిపాదన సమర్పించాలని సూచించారు. గిరిజన ప్రజలకు అవసరమగు సమాచారాన్ని వివిధ ప్రసార మాధ్యమాలను ఉపయోగించుకొని అందించాలని చెప్పారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, పార్వతీపురం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, ఎపిఒ మురళీధర్, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యం నాయుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయ పార్వతి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ప్రభాకర్ రావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ టి.జగన్మోహనరావు, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం.రుక్మాంగదయ్య, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.రవి, ఇపిడిసిఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ వేణుగోపాల్ నాయుడు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎంఎన్ రాణి, తదితరులు పాల్గొన్నారు.

27న అడలి వ్యూ పాయింట్ ప్రారంభం

ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్, ఎపిఒ, డిపిఒ

ప్రజాశక్తి-సీతంపేట

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న అడలి వ్యూ పాయింట్‌ను ప్రారంభిస్తామని ఐటిడిఎ ఎపిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం ఐటిడిఎలో ప్రెస్‌మీట్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27న ఉదయం 8 గంటలకు ఆడలి వ్యూ పాయింట్‌లోని రెస్టారెంట్, నైట్ క్యాంపింగ్ టెంట్లు ప్రారంభిస్తామని తెలిపారు. వ్యూ పాయింట్ వద్ద పర్యాటకుల కోసం ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వివిధ స్టాల్స్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో 'ఐ లవ్ సీతంపేట' పేరుతో ఏర్పాటు చేసిన ఫొటో పాయింట్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. 5డి థియేటర్‌ను పునఃప్రారంభిస్తామని చెప్పారు. జబర్దస్త్ కళాకారులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఐటిడిఎ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల విద్యార్థులతో ఫ్యాషన్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ స్టాల్స్, సవర ఆర్ట్స్ స్టాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. చిన్నపిల్లల కోసం వివిధ క్రీడల స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో ఎక్కడా ప్లాస్టిక్ ఉపయోగించకుండా పకడ్బందీ చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేతోపాటు జిల్లాలోని ఇతర ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

సీతంపేట ఏజెన్సీలో మరిన్ని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. దీనిలో భాగంగా ముఖ్యమంత్రి సీతంపేట పార్కు అభివద్ధికి నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అనంతరం ఆడలి వ్యూ పాయింట్ పోస్టర్‌ను ఐటిడిఎ పిఒ, ఎపిఒ జి.చిన్నబాబు, డిపిఒ సతీష్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి

కలెక్టర్ దృష్టికి కురుపాం నియోజకవర్గ సమస్యలు

వినతినిచ్చిన మాజీ డిప్యూటీ సిఎం శ్రీవాణి

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గంలోని పలు సమస్యలను మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్పశ్రీవాణి.. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలపై వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కురుపాం ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్య

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన
- పోలీసుల ఎదుట లొంగిపోయిన భర్త



మృతిచెందిన కరాసమ్మ

ప్రజాశక్తి-సాలూరు రూరల్


వివాహేతర సంబంధంతో కట్టుకున్న భార్యను కడతేర్చాడో వ్యక్తి. ఈ నెల 20న మండలంలోని కరాసువలసలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితుడు పోలీసుల వద్ద లొంగిపోయాడు. పోలీసుల కథనం ప్రకారం...

మండలంలో కరాసువలస గ్రామానికి చెందిన కరాసమ్మ(39), బొడ్డుదొర శ్రీను(45)కు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరూ అదే గ్రామంలో కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. కొంత కాలంగా సమీప గ్రామమైన కొత్తవలసకు మహిళతో శ్రీను వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. వారు కూలీ పనుల నిమిత్తం విశాఖపట్నం వెళ్లినట్లు అక్కడ వారికి ఇద్దరు పిల్లలు కూడా జన్మించారు. అక్కడ ఉండలేక స్వగ్రామం కరాసువలసలో శ్రీను ఇంటి పక్కనే కాపురం పెట్టారు. ఇరువురు ఇరుగు పొరుగున ఉండటంతో ప్రతిరోజూ ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 20న గొడవలు ముదరడంతో బయటకు వెళ్లి వచ్చిన శ్రీను మొదటి భార్య కరాసమ్మను తీవ్రంగా కొట్టి, చున్నీతో గొంతునులిమి హత్య చేశాడు. ఆమె మరణించిందన్న విషయం తెలిసి గ్రామం వదలి వెళ్లిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న కరాసమ్మను తన అత్త, మామలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు చెప్పడంతో ఆమె మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. భర్త శ్రీను హత్య చేశాడని కరాసమ్మ తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిందితుడు శ్రీను మంగళవారం గ్రామస్తులు, విఆర్ఒ సమక్షంలో పోలీసుల వద్ద లొంగిపోయాడు. ఆయనపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపినట్లు సాలూరు రూరల్ సిఐ పి.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలను సిఐ వెల్లడించారు.



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు శ్రీను

చెకుముకి పరీక్ష విజయవంతం



పార్వతీపురంరూరల్.. ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన బుధవారం మండలంలో పాఠశాల స్థాయిలో నిర్వహించిన చెకుముకి ప్రతిభా పరీక్ష విజయవంతమైంది. జిల్లాలో 147 ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత పాఠశాలల్లో 8,9,10 తరగతులు చదువుతున్న 8300 మంది విద్యార్థులు హాజరైనట్టు జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండపల్లి గౌరునాయుడు, సార్తి మహేశ్వర రావు తెలిపారు. ఇందులో ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురిని ఎంపిక చేసి, మండల స్థాయిలో అక్టోబర్ ఒకటో తేదిన వారికి పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పాఠశాల స్థాయి పరీక్ష విజయవంతం కావడానికి సహకరించిన ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీతానగరం : జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి చెకుముకి సైన్సు టాలెంట్ పరీక్ష నిర్వహించారు. నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రశ్న పత్రాలను డిప్యూటీ డిఇఒ రాజ్ కుమార్ ఆవిష్కరించారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు మనోజ్ కుమార్, సైన్సు ఉపాధ్యాయులు భారతి, చూడామణి, రేవళ్ల సతీష్ రాజు పాల్గొన్నారు.

వీరఘట్టం : చెకుముకి ప్రతిభా పరీక్షకు 17 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి 930 మంది విద్యార్థులు హాజరైనట్లు జెవివి మండల కన్వీనర్ గౌరీశంకరరావు, నాయకులు ఎస్.సతీష్ తెలిపారు.



వీరఘట్టం.. గంగంపేట గిరిజన ఆశ్రమ పాఠశాలలో చెకుముకి పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అన్ని గ్రామాల్లోనూ పక్కా రహదారులు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్


నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ పక్కా రహదారుల నిర్మాణాలు ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర తెలిపారు. బుధవారం మండలంలోని నర్సిపురం, కారాడవలస గ్రామాల్లో రూ.60 లక్షల ఉపాధి నిధులతో సిసి రహదారి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా అన్ని గ్రామాల్లోనూ మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. రూ.17 కోట్ల ఉపాధి నిధులతో శ్మశానాల అభివృద్ధి, రహదారుల నిర్మాణంతోపాటు కాలువల ఏర్పాటుకు గ్రామాల నుంచి తనకు ప్రతిపాదనలు అందినట్లు తెలిపారు. వీధి దీపాల నిర్వహణ, గ్రామాల్లో పరిశుభ్రతను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు బోను చంద్రమౌళి, గొరజాన చంద్రమౌళి, సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట్ నాయుడు, మాజీ ఎంపిపి గౌరీ వెంకటరమణ, ఎంపిటిసి ఏగిరెడ్డి తవిటినాయుడు, నాయకులు పెద్దిరెడ్డి సత్యనారాయణ శ్రావణి, జనసేన నాయకురాలు ఆగూరు మణి, తదితరులు పాల్గొన్నారు.

మత్స్య వనరులను అభివృద్ధి పరచాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో మత్స్య వనరులను అభివృద్ధి పరచాలని జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర-విజన్ 2047 ప్రణాళిక డాక్యుమెంటరీ తయారీపై సలహాలు, సూచనలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో అయన మాట్లాడుతూ జిల్లాలో మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా మత్స్య సంపద మొదటి స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామ మత్స్యకార సంఘాలను కోరారు. మత్స్యకారులు సేంద్రియ విధానంలో చేపల చెరువులను సాగుచేయాలని సూచించారు. రాష్ట్రంలో అత్యల్పంగా చేపల పెంపకం మన జిల్లాలోనే ఉందన్నారు. మత్స్య సంపద అభివృద్ధి చెందడానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో హేచరీస్ ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఆక్వా ల్యాబ్ మన జిల్లాలో లేదని, కనీసం మొబైల్ ఆక్వా ల్యాబ్ ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాకు హేచరికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. మత్స్యకార నాయకుల నుండి సలహాలు, సూచనలు తీసుకున్నట్లు చెప్పారు. మత్స్యకార నాయకులు మత్స్యశాఖ ఆధ్వర్యంలో చెరువుల్లో పూడికతీతలు చేపట్టాలని కోరారు. మహిళా మత్స్యకార సంఘాలు స్వయం ఉపాధి కింద రంగు చేపల పెంపకంపై శిక్షణ ఇవ్వాలని, చేపల నిల్వ కోసం కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. తోటపల్లి రిజర్వాయర్ పరిధిలో మత్స్యకారుల కోసం బ్రాడ్ బాండ్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ దాసరి లక్ష్మణ రావు, పార్వతీపురం, పాలకొండ, సాలూరు మత్స్యకార అభివృద్ధి అధికారులు, మత్స్యశాఖ గ్రామ సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా మత్స్యశాఖ అధికారి తిరుపతయ్య

ఇసుక ర్యాంపుపై సరిహద్దు వివాదం

ఇరు రాష్ట్ర అధికారుల పరిశీలన

ప్రజాశక్తి -భామిని

భామిని మండలంలోని దిమ్మిడిజోల గ్రామ సమీపంలో వంశధార నది తీరంలో ఇసుక ర్యాంపు సరిహద్దు వివాదం రావడంతో ఒడిశా, ఆంధ్రా అధికారులు బుధవారం పరిశీలించారు. రెండు రాష్ట్రాల నుంచి వేర్వేరు పేర్లతో ఇసుక ర్యాంపు నిర్వహిస్తున్నారని వివాదం రావటంతో ర్యాంపును నిలిపేశారు. ఆంధ్ర -ఒడిశా సరిహద్దు వివాదం పరిష్కారానికి బుధవారం రెండు రాష్ట్రాల అధికారులు ర్యాంపు నిర్వహణ స్థలాన్ని పరిశీలించారు. 1984 అంతర్రాష్ట్ర సరిహద్దు భూ రికార్డులను వారు పరిశీలించారు. సరిహద్దు వివాదం, పరిశీలన అంశాలను పూర్తి స్థాయిలో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని పాలకొండ సబ్‌కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్లు, మైనింగ్ అధికారులు, డిప్యూటీ తహశీల్దార్ శేఖరం, ఆర్ఐ రాంబాబు, ఒడిశా అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ దీపన్ పరిడా, మైనింగ్ అధికారి రాజేంద్ర మీజు, తహశీల్దార్ దోమబోరు దర్మిల్లి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న ఆంధ్రా, ఒడిశా అధికారులు



ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు, రైతులు

రైతు సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-కొమరాడ

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. కొమరాడ సచివాలయం వద్ద ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. అనంతరం సచివాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు ఉపేంద్ర మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలని డిమాండ్‌చేశారు. రైతులకు రెండు లక్షల రూపాయల వరకు రుణాలు మాఫీ చేయాలన్నారు. కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలుకార్డులు ఇచ్చి రుణాలు బ్యాంకు ద్వారా అందించాలని కోరారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, జిఒ నెంబర్ 22ను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో నష్టపోయిన రైతులకు పంటల బీమా పరిహారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉచిత పంటల బీమా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్.అప్పలస్వామి, గౌరినాయుడు, పోలి నాయుడు, తాతబాబు, చిన్నమనాయుడు రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని సూపరింటెండెంట్ శోభారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హాజరయ్యారు. ముందుగా కమిటీ సభ్యులుగా ఆకుల రమేష్, బోటు గౌరీశంకరావు, మీసాల భారతిని ఎంపిక చేశారు. ఆసుపత్రిలో సమస్యలను కమిటీ ముందుంచి, ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు తీర్మానించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్మాణ దశలో ఆగిపోయిన అదనపు తరగతి భవనాలను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్‌బాబు, మండల కన్వీనర్ కె.వి.కొండయ్య, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమ్మె విరమణకు చొరవ చూపాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యుల సమ్మె విరమణకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధానకార్యదర్శి పి.రంజిత్‌కుమార్ కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందుతున్న నేపథ్యంలో వైద్యుల సమ్మె వల్ల నిరుపేద గిరిజనులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. తక్షణమే సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ పగడాలమ్మ

గురువులను గౌరవించాలి : డిఇఒ

ప్రజాశక్తి-సాలూరు రూరల్

తల్లిదండ్రులు, గురువులను విద్యార్థులు గౌరవిస్తే అప్పుడే బంగారు భవిష్యత్తు లభిస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ తెలిపారు. బుధవారం సాలూరు పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డిఇఒ ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బందితో ప్రత్యేక చర్చా వేదిక నిర్వహించారు. ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు ఇస్తూ ఫలితాల సాధనలో ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైన్స్ సంబరాలు కార్యక్రమంలో చెకుముకి పరీక్షా పత్రాలను జెవివి నాయకులు కె.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఉపాధ్యాయులు సుధీర్‌రాజు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారం అందుకున్న వనజ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లు రవి ప్రసాదరావుకు మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు, వనజ పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు బుధవారం ఘనంగా సన్మానించారు. రవిప్రసాదరావు సేవలను ప్రశంసించారు.

వరద బాధితులకు విరాళాలు

ప్రజాశక్తి - కురుపాం

విజయవాడ వరద బాధితుల కోసం కురుపాం కిషోర్ చంద్రదేవ్ డిగ్రీ కళాశాల సిబ్బంది, విద్యార్థులు బుధవారం విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాలను ఆంధ్రా యూనివర్సిటీకి అందిస్తామని, వారి ద్వారా బాధితులకు పంపిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ వి. గురువులు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది వంశి, పవన్, భారతి పాల్గొన్నారు.

పోషక విలువల ఆహారంతో ఎంతో మేలు

ప్రజాశక్తి-పాచిపెంట

పోషక విలువలు కలిగిన ఆహారాన్ని బాలింతలు, గర్భిణులు ప్రతిరోజూ తప్పనిసరిగా తీసుకోవాలని పాచిపెంట ఐసిడిఎస్ సిడిపిఒ బి.అనంతలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలో మడవలస అంగన్వాడీ కేంద్రం వద్ద పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల పిల్లల్లో ఎదుగుదల ఉంటుందని చెప్పారు. రక్తహీనత లోపాలను అరికట్టవచ్చునని తెలిపారు. పౌష్టికాహారం ఆవశ్యకత, ఆరోగ్యంపైన, ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలపైన అవగాహన కల్పించారు. పోషకాహారం ప్రదర్శన ఏర్పాటుచేశారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీవరం అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఎల్విన్‌పేట గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శ్రమదానంతో పరిసరాలను శుభ్రపరిచారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే మలేరియా, టైఫాయిడ్, అతిసార లాంటి వ్యాధులు ఎలా వ్యాపిస్తాయో, ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో ప్రజలకు అవగాహన కల్పించారు. డిగ్రీ కళాశాల నుంచి ఎల్విన్‌పేట వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-భామిని

భామినిలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు బుధవారం ఆప్తాలమిస్టు టి.కృష్ణారావు కంటి పరీక్షలు చేశారు. సుమారు 500 మందికి

ఇరుకు గదుల్లో తరగతులు

ప్రజాశక్తి -భామిని

గిరిజన విద్యార్థులకు సరైన వసతితో మెరుగైన విద్యను అందించాలన్న ప్రభుత్వ ఆశయం క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. భామిని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల పరిస్థితి దీనికి అర్థం పడుతుంది. భామిని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో మూడు నుండి పది తరగతుల వరకు 257 మంది విద్యనభ్యశిస్తున్నారు. వీరికి ఆశ్రమ పాఠశాలలో 12 గదులు అందుబాటులో ఉన్నాయి. అందులో 8 గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. మిగిలిన నాలుగు గదుల్లో 257 మంది విద్యార్థులు ఉండాల్సిన పరిస్థితి. కొంతమంది విద్యార్థులు తమ తరగతి గదుల్లోనే తమ పెట్టెలను, ఇతర వస్తువులను ఉంచుకుంటున్నారు. విద్యార్థికి ఆరోగ్యం బాగోలేకపోయినా తరగతి గదిలోనే గడపాల్సిన పరిస్థితి. ఈ సమస్యకు పరిష్కారం లేదా? అంటే ఉందని చెప్పొచ్చు. కానీ అధికారులు ఈ అంశంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించాలని, గిరిజన ఆశ్రమ పాఠశాలకు 2019లో రూ.8.75 కోట్లు అదనపు వసతిగృహ నిర్మాణం చేపట్టారు. కరోనా సమయంలో భవన నిర్మాణం ఆరు నెలలపాటు నిలిచినా, ఒప్పందం ప్రకారం కాంట్రాక్టర్ 2021 ఏడాది చివరికి భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. గతంలో ఈ అదనపు భవనంలోనే సుమారు 15 మంది ట్రెయినీ ఐఎఎస్‌లు వారం రోజులపాటు ఉన్నారు. గిరిజన ప్రాంతాల్లో వివిధ అంశాలపై పరిశోధన చేశారు. భవన నిర్మానం చేపట్టి ఏళ్లు గడుస్తున్నా దానిని ప్రారంభించలేదు. భామిని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అదనపు భవనాలు అందుబాటులో ఉన్నా వినియోగించేలేని పరిస్థితి. ఈ అంశంపై కాంట్రాక్టర్‌ని ప్రశ్నిస్తే, ఒప్పందం ప్రకారం పూర్తి చేశానని, కేవలం రూ.1.35 కోట్లు చెల్లించారని, రూ.7.40 కోట్లు బకాయి ఉందని తెలిపారు. మిగిలిన డబ్బులు చెల్లిస్తే ప్రభుత్వానికి భవనం అప్పగిస్తానని తెలిపారు. ఇటీవల కోర్టు తనకు మూడు కోట్లు రూపాయలు చెల్లించాలని చెప్పిందని, కానీ నేటి వరకు చెల్లించలేదని తెలిపారు. విద్యార్థుల మెరుగైన వసతి కల్పనకు అధికారులు చొరవ తీసుకొని, నిర్మించిన అదనపు భవనాన్ని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచని వసతిగృహ అదనపు భవనం



తరగతి గదిలోనే ఉన్న విద్యార్థుల బ్యాగులు, సామగ్రి

ఐటిడిఎ డిఇ వివరణ

అదనపు భవనం గురించి ఐటిడిఎ డిఇ సింహాచలాన్ని వివరణ కోరగా, ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే, కాంట్రాక్టర్‌కు చెల్లిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఆ అదనపు భవనం అంశం కోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు.

శిథిలావస్థలో పాఠశాల

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని దారపాడు పంచాయతీ పరిధిలో రామానగరంలోని ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. 1996లో రేకుల షెడ్‌తో పాఠశాలను నిర్మించారు. నాటి నుంచి నేటివరకు కనీసం మరమ్మతులు లేకుండా ఉంది. వర్షం వస్తే పాఠశాలంతా కారిపోతోంది. చుట్టూ ఉన్న మట్టి కరిగిపోయింది. ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ పాఠశాలలో ఆరు గ్రామాలకు చెందిన 40 మంది గిరిజన బాలబాలికలు విద్యనభ్యశిస్తున్నారు. రెండు విడతల్లో నాడు-నేడు పనులు చేపట్టినా ఈ పాఠశాల గురించి పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కొత్త భవనాన్ని నిర్మించాలని సిపిఎం నాయకులు ఎం.తిరుపతిరావు డిమాండ్‌చేశారు.

దిగుబడులు పెంచాలి

ప్రజాశక్తి-పాచిపెంట

ప్రభుత్వం వ్యవసాయ శాఖ తరపున నాణ్యమైన విత్తనాన్ని అందిస్తుందని, ఆ విత్తనంతో మూడేళ్లపాటు నాణ్యమైన దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ ఎడి కె.మధుసూదనరావు తెలిపారు. బుధవారం మండలంలోని పింద్రంగివలస గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంట ఎరుపెక్కడానికి అనేక కారణాలు ఉంటాయని తెలిపారు. రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల సలహాలను తీసుకోవాలని సూచించారు. అధిక దిగుబడులు సాధిస్తూనే ఖర్చులు కూడా తగ్గించుకోవాలని తెలిపారు. పంట ఎదిగిన తర్వాత బస్తాల యూరియా కన్నా నానో యూరియా, నానో డిఎపి వినియోగిస్తే ఎరువులపై ఖర్చు తగ్గుతుందని చెప్పారు. ప్రకృతి సేద్య కషాయాలను ఉపయోగించి పురుగుల మందులపై, రసాయన ఎరువులపై ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. ఏకపంట విధానాన్ని వదిలి బహుళ పంటల విధానాన్ని, అంతర పంటల విధానాన్ని, పంట మార్పిడిని ఆచరించాలని కోరారు. అనంతరం ప్రకృతి సేద్య ఎంటి నాయుడు ఆధ్వర్యంలో జిల్లేడు కషాయం తయారీ ఉపయోగాలను రైతుకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, విఎఎ పవిత్ర, ప్రకృతి సేద్య సిబ్బంది కరి శ్రీను, సురేష్ పాల్గొన్నారు.



బలిజిపేట.. వరి పొలంలో తెగుళ్లను పరిశీలిస్తున్న ఎఒ శ్రావణ్‌కుమార్

బుడ్డిపేటలో..

సీతానగరం : మండలంలోని బుడ్డిపేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎఒ ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వరి, చెరకు పొలాలను పరిశీలించి, సుడిదోమ ఉధృతిని గుర్తించారు. పొడ తెగులును కూడా గుర్తించి, నివారణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో పెదబోగిలి ఉపసర్పంచ్ కె.అరవింద్, రైతులు ఇచ్చాడ రాంబాబు, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని మిర్తివలస, తుమరాడ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎఒ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యాన నిర్వహించారు. పొలాల్లో పాము పొడ తెగులు, సుడి దోమలను పరిశీలించి, రైతులకు నివారణ చర్యలను తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దూడి భాస్కర్‌రావు, మరడ రాజు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : మండలంలో మావుడి, కందులపదం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి అనురాధ పండా మాట్లాడుతూ వ్యవసాయంలో నూతన విధానాలను అవలంబిస్తూ అధిక ఆదాయాన్ని పొందేవిధంగా రైతులు వ్యవసాయం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి బి.ఝాన్సీ, మామిడిపల్లి వెటర్నరీ డాక్టర్ ప్రభాకర్, మావుడి, కందులపదం సర్పంచులు పీడిక సుదర్శనరావు, తాడంగి కన్నం నాయుడు, తెలుగు రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు బుస తవుడు, తదితరులు పాల్గొన్నారు.



పాచిపెంట.. పత్తిసాగులో మెలకువలను వివరిస్తున్న ఎడి మధుసూదనరావు

భామిని : మండలంలోని పసుకుడి, నేరడి గ్రామాలలో వ్యవసాయ అధికారి కె.సింహాచలం ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి, పత్తి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం పత్తికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగుచేయడం లాభదాయకమని రైతులకు ఎఒ సూచించారు. వ్యవసాయ సహాయకులు కె.ఈశ్వర్, వి.తేజ, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ ఎం.అంబాజి, పడాల భూదేవి, భోగాపురం రవినాయుడు, భోగాపురం అప్పలనాయుడు, సాకేటి రామారావు, బి.తిరుపతి రావు, అంగూరు రమేష్ నాయుడు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో కుడ్డపల్లి, కిండంగిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి పి.శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర పరిశీలనతోపాటు నీమాస్త్రం, ద్రవజీవామృతం తయారు చేసి ప్రదర్శించారు. చీడ పీడతలు నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టాలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు కలుపు మొక్కలు తొలగించాలని సూచించారు. వరి ఏపుగా పెరగడానికి కొన్ని చిట్కాలు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మంచి చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పేదలకు మంచి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. బుధవారం పట్టణంలో బెలగాంలో 16 వార్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వార్డులో ఉన్న ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బార్నాల సీతారాం, తేజవతి, నిర్మల కుమారి, బడే గౌరు నాయుడు, కోలా మధు, టిడిపి పట్టణ కార్యదర్శి మజ్జి వెంకటేష్, అల్లు బుజ్జి, చీకటి బద్రినారాయణ, గొట్టా శివకేశవరావు, జనసేన నాయకులు గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు..



పార్వతీపురంటౌన్.. సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర

కురుపాం : సంక్షేమం, అభివద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం మండలంలో గుజ్జువాయి పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గుజ్జువాయి గ్రామంలో ఎఒ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగినటువంటి పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు కొన్ని సూచనలు ఇచ్చారు. అక్కడ రైతులకు సాగునీరు అందుతున్న గుజ్జువాయి రిజర్వాయరును సందర్శించారు. వేల ఎకరాలకు నీరు అందించే రిజర్వాయర్ నుండి సాగునీరు వృథాగా పోవడంతో వాటి మరమ్మతుల గూర్చి అధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ హెచ్.నాగేశ్వరరావు, ఎంపిడిఒ జి.రమేష్ బాబు, వెటర్నరీ డాక్టర్ శైలజ, మండల కన్వీనర్ కెవి కొండయ్య , మాజీ సర్పంచ్ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

భామిని : ప్రజా రంజక పాలనను కూటమి ప్రభుత్వం అందిస్తుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి అన్నారు. బుధవారం భామిని మండలంలోని తలడా, అత్తికొత్తూరు గ్రామాలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర రహదారిపై ట్రాఫిక్(ర్)

నిత్యం నిలిచిపోతున్న వాహనాలు

ప్రజాశక్తి కొమరాడ

పార్వతీపురం-రాయగడ అంతర్రాష్ట్ర రహదారి గోతులమయం కావడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కొమరాడ వద్ద బుధవారం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కొమరాడ, చోళ్లపదం, గుమడ గ్రామాల వద్ద రహదారిపై భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనాలు ఆ గోతుల్లో ఆగిపోవడంతో రద్దీగా ఉన్న రహదారిపై వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోతున్నాయి. ట్రాఫిక్ అంతరాయంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక నాయకులతో పాటు ఒడిశా లారీ యూనియన్ సహకారంతో గోతులను జెసిబి ఏర్పాటు చేసి పూడ్చుతున్నా, వర్షాలు పడడంతో మరల అదే పరిస్థితి ఎదురవుతోంది. కొత్తగా రోడ్డు నిర్మిస్తే తప్ప సమస్యకు పరిష్కారం దొరికే పరిస్థితి లేదు. తక్షణమే అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన భారీ గోతులను కప్పి ట్రాఫిక్ అంతరాయాన్ని, ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



కొమరాడలో రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు



నిరసన చేపడుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

హామీలు అమలు చేయాలని నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బుధవారం కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ధాళీ బజావో పేరిట కంచాలు మోగిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తిన మోహనరావు మాట్లాడుతూ సూపర్ సిక్స్‌తోపాటు ఇతర హామీలను ఇచ్చి ప్రజలను ఆకర్షించి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అవుతున్నా హామీలు అమలుకు ప్రయత్నం చేయకుండా ప్రజలను మోసగిస్తున్నారని విమర్శించారు. దీంతో పిసిసి అధ్యక్షులు షర్మిల పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పార్కుకు పూర్వ వైభవం

ఐటిడిఎ పిఒ అశుతోష్

ప్రజాశక్తి-పార్వతీపురం

తోటపల్లి వద్ద ఉన్న ఐటిడిఎ పార్కుకు పూర్వవైభవం తీసుకురావాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీ వాత్సవ అన్నారు. పార్కును బుధవారం ప్రాజెక్టు అధికారి సందర్శించారు. పార్కు మొత్తాన్ని స్వయంగా పరిశీలించి, వసతులను తనిఖీ చేశారు. పార్కుకు పూర్వవైభవం తీసుకు రావాలన్నారు. చిన్నారుల ఆటసామగ్రి ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. పార్కులో నిర్మించి ఖాళీగా ఉన్న భవనాల్లో ట్రైబల్ మ్యూజియం, అటవీ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నెల రోజుల్లో పూర్తి స్థాయిలో పార్కు సందర్శకులను ఆకట్టుకోవాలని, ఇందుకుగాను అవసరాలను గుర్తించి తక్షణం వాటిని నివేదించాలని ఆయన ఆదేశించారు. తోటపల్లి జలాశయంలో ఉన్న బోటింగ్ కార్యక్రమాన్ని కూడా కొనసాగే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. పార్కులో రానున్న రోజుల్లో పర్యాటకులు బస చేసేందుకు, పర్యాటకులకు ఆహారం లభించేలా చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. కెఫిటీరియా ఏర్పాటు చేయాలని చెప్పారు. పార్కును ఆహ్లాదకరంగా ఏర్పాటు చేయాలని, ఆకర్షణీయంగా స్వాగత ద్వారం ఏర్పాటు చేయాలని, సెల్ఫీ పాయింట్ ఉండాలని, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ఇంజినీర్ తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



ఐటిడిఎ పార్కును పరిశీలిస్తున్న పిఒ అశుతోష్

మార్చికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలో 2019-20లో మంజూరైన ఇళ్లను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిచేయాలని, లేదంటే బిల్లుల చెల్లింపునకు అవకాశం ఉండదని మండల ప్రత్యేక అధికారి శివప్రసాద్ స్పష్టంచేశారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డిఇ సోమేశ్వరరావు, తహశీల్దార్ డి.రవి, ఎంపిడిఒ పాత్రో, ఎఇ వెంకటేష్. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

28న మన ఇల్లు.. మన గౌరవం

జియ్యమ్మవలస : ఈ నెల 28న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ ఎఇ ఎల్.ఉమామహేశ్వరరావు కోరారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సూపరింటెండెంట్ కె.రామారావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పంచాయతీలో లేఔట్ వద్ద మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. రూఫ్ స్థాయిలో ఉన్న ఇళ్లను అక్టోబర్ నెలాఖరిలోగా పూర్తి చేయాలన్నారు. బిఎల్, ఎల్ఎల్ స్థాయిలో ఉన్న గృహాలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలోగా పూర్తి చేయాలని తెలిపారు. పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టిన ఇళ్లకు బిల్లులను వెనువెంటనే చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ శ్రీనివాసరావు, ఎపిఎం నాగభూషణరావు, హరినారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శివప్రసాద్

జనసేన వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీ పురం నియోజకవర్గంలో జనసేన పార్టీ కార్యక్రమాలను నిర్వహించేందుకు గాను వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించినట్లు ఆ పార్టీ పిఎసి సభ్యులు ఆదాడ మోహనరావు తెలిపారు. బుధవారం జనసేన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్వతీపురం పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పిన్నింటి జయకృష్ణ, పార్వతీపురం నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రెడ్డి కరుణకుమార్, పార్వతీపురం మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అన్నాబత్తుల గాయత్రీని, బలిజిపేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అప్పలనాయుడును నియమించినట్లు తెలిపారు. ఈ మేరకు వారికి నియామక పత్రాలను అందించారు.



నియామకపత్రాలను అందజేస్తున్న ఆదాడ మోహనరావు